
# చలన సమస్యలున్న శిశువులు మరియు చిన్నపిల్లలకు స్థితి మరియు ప్రేరణ సంబంధిత క్రియలు




## జాతీయ మానసిక వికలాంగుల సంస్థ

(సామాజిక న్యాయ మరియు అధికారిత మంత్రాలయము, భారత ప్రభుత్వము)

మనోవికాస్‌నగర్, సికింద్రాబాద్ – 500 009. ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 040–27751741 ఫ్యాక్స్ : 040–27750198

ఇ–మెయిల్ : dirnimh@hd2.vsnl.net.in వెబ్‌సైట్ : www.nimhindia.org

**చలన సమస్యలున్న శిశువులు మరియు చిన్నపిల్లలకు స్థితి మరియు ప్రేరణ సంబంధిత క్రియలు**

కాపీరైటు © 2003
సర్వహక్కులు ప్రకాశకులవి

రచయితలు
డా॥ అమర్‌జ్యోతి పర్షా
కె. వెంకట సుబ్బారెడ్డి

ISBN 81 86594 93 0

చిత్రములు : ఆనంద్ ఆర్ట్ స్టూడియో, సికింద్రాబాద్. ఫోన్ 040-27646246
ముద్రణ : శ్రీ రమణాప్రాసెస్, సికింద్రాబాద్. ఫోన్ 040-27811750



# విషయసూచిక


తొలిపలుకు

పీఠిక

కృతజ్ఞతలు

ఈ పుస్తకము గురించి

ఉపోద్ఘాతము

శిరస్సు స్వాధీనత 13

దొర్లుట 25


కూర్చొనుట 33

ప్రాకుట 51

మోకాలిపై కూర్చుండుట 59

నిలబడుట 65

నడచుట 85

डॉ. एल. गोविन्द राव
निदेशक
Dr. L. GOVINDA RAO
Director

राष्ट्रीय मानसिक विकलांग संस्थान
(सामाजिक न्याय और अधिकारिता मंत्रालय, भारत सरकार)
NATIONAL INSTITUTE FOR THE MENTALLY HANDICAPPED
(Ministry of Social Justice & Empowerment, Government of India)

24 జూన్ 2003

# తొలిపలుకు

వికలాంగులైన పిల్లల సక్రమమైన పెరుగుదల నిమిత్తము వారి తలిదండ్రులు, వికలాంగత మరియు పునరావాసము గురించి అవగాహన పొందుట చాలా అవశ్యము. ఈ అవగాహనతోపాటు పిల్లల పెరుగుదలకు అవరోధము కలిగించు వైకల్యములను పెంచు సాంప్రదాయక అలవాట్లను తెలుసుకొనుట అవసరము. అన్ని సాంప్రదాయక పెంపుదల అలవాట్లు ఉపయోగించవని చెప్పుటకు వీలులేదు. వీటిని మేము మా NIMH లో తల్లితండ్రులకు తెలియచేయుటకై కృషిచేయుచున్నాము. ఈ దిశలో మేము క్రమానుసారముగా వైకల్యములుగల పిల్లల పెరుగుదలకు రూపొందించిన నమూనాలు మరియు పరికరములపై ఆత్మపరిశోధన జరుపుచున్నాము. చిరుప్రాయంలో పిల్లలను సరి అయిన పద్ధతిలో ఎత్తుకొనకపోవడం, సరియైన స్థితిలో ఉంచకపోవడం మరియు జాగ్రత్తగపడకపోవడం వారి వైకల్యస్థితికి ఒక కారణము.

పెరుగుదలలో వైకల్యములుగల పిల్లలలో చలన (Motor) సమస్య మిక్కిలి ఆందోళనకరము. ఇటువంటి పిల్లలలో ఎక్కువ సమస్యలకు కారణము, పిల్లలను చిరుప్రాయములో సరి అయిన స్థితిలో ఉంచకపోవడము మరియు జాగ్రత్తగా ఎత్తుకొనకపోవడము లేదా పట్టుకొనకపోవడమే వారిలోని కదలిక సంబంధిత సమస్యలకు కారణమగుచున్నవి. బిగదీసుకుపోయిన లేక స్థిరత్వములేని పిల్లవానిని సరి అయిన స్థితిలో కదలికలు నేర్పుట, శరీరమును సహజస్థితికి

Contd.....

తెచ్చుటకు ఉపయోగించును. ఈ విధముగా సహజస్థితికి తెచ్చుటవలన తేలికగా కదలుటకు, స్థిరత్వమునకు, కొత్త ప్రవీణతలు నేర్చుకొనుటకు, పిల్లవానికి సహకరించును. చలన (మోటారు) సమస్యలుగల పిల్లలను సరి అయిన స్థితిలో ఉంచుట మరియు వారిని జాగ్రత్తగా పట్టుకొనుట లేదా ఎత్తుకొనుటగురించి తెలుసుకోవడం అత్యవసరం.

ఈ పుస్తకము అసహజమైనస్థితి మరియు వాటికి సరిఅయిన సవరణలు తెలియచేయును. ఇందులో ఇచ్చిన ఉదాహరణలవలన తల్లి, తన పిల్లవాని సమస్యలను గుర్తించుటకు వీలగును. సరి అయిన స్థితులను సరళభాషలో, క్రమానుసారముగ తెలియచేయుటచే అర్థము చేసుకొని ఆచరించుటకు తేలికగా ఉండును.

అందుచేత ఈ పుస్తకము గ్రామీణపిల్లల స్థితి, ప్రేరణలు అలవాటుచేసుకొని వృద్ధిపరచుకొనుటకు వీలుగా రూపొందించబడెను. ఇట్టి వైకల్యములు (మోటారు సమస్యలు)గల పిల్లల సంరక్షణలో నిమగ్నులైన తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామపరిచారికలు, నిపుణులకు ఈపుస్తకము వారి ప్రావీణ్యతను అత్యున్నత స్థాయికి పెంచుటకు ఉపయోగపడును.

యల్. గోవిందరావు, పిహెచ్.డి.

मनोविकास नगर, सिकंदराबाद - 500 009 तार : मनोविकास दूरभाष : (का) 27759267 (नि) 27757715 फैक्स : 0091 (40) 27758817
Manovikasnagar, Secunderabad - 500 009 Grams MANOVIKAS Phones (O) 27759267 (R) 27757715 Fax 0091 (40) 27758817
E-mail dirnimh@hd2 vsnl net in lan_gra@rediffmail com Website www nimhindia org

# పీఠిక

కదలిక మరియు ఆటల అనుభవములు శిశువులు మరియు చిన్న పిల్లలలో చలనము కలిగించు అవయవములు స్పర్శ, జ్ఞాన, గ్రహణ, భాష మరియు ఇతర సాంఘిక కౌశలములకు పునాది కల్పించును. శారీరిక మరియు ఇతర పెరుగుదలలో ఆలస్యమైన శిశువుల, చిన్నపిల్లల విషయములో ఈ అనుభవమువలన రాజీపడుట జరుగును. అందుచేత ఇట్టి పిల్లలు, ఆటలు మరియు ప్రేరణలకు పెద్దల సహకారముపై ఆధారపడుదురు. ఇందువలన తల్లితండ్రులు, ప్రథమ హస్తక్షేపనిపుణులు కలిసి ఒకజట్టుగా పనిచేసి వారి కదలికకు, ఆటకు అవకాశములు కల్పించవలెను. స్థిరత్వము కలుగచేయుట యొక్క ముఖ్యోద్దేశము శరీరమునకు మంచి నిలకడ కలుగచేయుట మరియు కదలికలను తేలిక పద్ధతిలో చేయుట. దీనివలన పిల్లలు పరిసరాలతో ప్రభావితమై గ్రహించుశక్తిని వృద్ధిచేసికొందురు. అందుచేత తల్లితండ్రులకు పిల్లల యొక్క స్థితుల ప్రాముఖ్యత, వాటికి సరియైన ప్రేరణ పద్ధతులగురించి బోధించుట, నిదర్శనలతో చూపుట చాలా ముఖ్యము. వీటివలన ఆటలతో విషయములు గ్రహించుటకు, నేర్పుటకు అవకాశముకలుగును.

పెరుగుదలలో ఆలస్యమైన పిల్లల తల్లితండ్రులు పలుపర్యాయములు తమ పిల్లలకు కావలసిన ప్రేరణక్రియలు పూర్తిగా సమకూర్చుటలో అసఫలులగుదురు. అలాంటివారి నిపుణతను పెంచుటకు, వివిధస్థితులయొక్క అనేక ప్రక్రియల సంకలనము ప్రస్తావించడమైనది. ఈ ప్రక్రియలు సులభమైనవి, తేలికగా ఆచరణయోగ్యమై, అనేక ఉదాహరణలతోకూడి, తల్లితండ్రుల యోగ్యతనిర్మించుటకు సాధ్యమగును.

ఈ పుస్తకముయొక్క ఉపయోగము : తరచుగా తల్లిదండ్రులు తమపిల్లల సహజపెరుగుదలపై దృష్టికేంద్రీకరించకపోవడం వలన పిల్లల పెరుగుదలలో ఆలస్యమును గమనించరు. ఇట్టి సమస్యలు ఎదురైనపుడు తల్లిదండ్రులు పిల్లల సంరక్షణలోను లేక సహజపెరుగుదల కల్పించుటలో కొరతను అనుభవింతురు. నిపుణుల సహాయము అందుబాటులోలేని కారణమున తల్లిదండ్రుల యందు నిరాశ అధికమగును. తల్లితండ్రులు ఎదుర్కొనే ఈ సమస్యలను పోగొట్టుటకు, తల్లిదండ్రులకు తగిన సహాయము అందుబాటులో ఉంచుటకు పిల్లల పెరుగుదలను పెంచుటకు ఈ పుస్తకము తయారుచేయబడినది. ఇది తల్లితండ్రులకు, ఆధారిక స్థాయి కార్యకర్తలకు శిశువును సరియైన స్థితియందుంచుటకు శిశువు ఆటలో పాల్గొనుటకు ప్రేరణప్రక్రియ కల్పించి, ఇందుమూలముగా శిశువుకు పెరుగుదలలో కావలసిన శక్యత కల్పించుటకు సహాయపడును.

ఈ పుస్తకము తల్లితండ్రులకు తమ గృహవాతావరణములో తమ రోజువారీ పనులతోపాటు చేసికొనుటకు వీలగు సామాన్యమైన పద్ధతులను తెలియచేయును. ఇది పెరుగుదల పెంచుటయేగాక తరువాత కలుగు చలన (మోటారు) సమస్యల వలన అనర్థము కలుగకుండచేయును. (అనగా అసాధారణ స్థితి, కుచించుకుపోవుట, అంగవైకల్యము). దీనిని గృహాధారిత కార్యక్రమముగా, ఖర్చుతగ్గించుటకు మార్గదర్శనిగా వాడవచ్చును. అందుకు ఈ పుస్తకము రూపకల్పనచేయబడినది. ఈ పుస్తకము తల్లితండ్రులకు, ఆధారిక స్థాయి కార్యకర్తలకు ఉపయోగము కొరకు ఉద్దేశించబడినది.

డా॥ అమర్‌జ్యోతి పర్షా

# కృతజ్ఞతలు

ఈ పుస్తకము తయారు చేయుటలో సహాయపడిన వారందరికి మేమెంతో ఋణపడి యున్నాము.

ఈ ప్రాజెక్టును పూర్తిచేసి, ఈ పుస్తకమును తయారు చేయుటకు మాకు నిరంతర సహాయ, సహకార ప్రోత్సాహములు అందించిన శ్రీ యల్. గోవిందరావు, పి.హెచ్.డి, ఎన్.ఐ.ఎమ్.ఎచ్ (NIMH) డైరెక్టరు గార్కి మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

మా తేజ కేంద్రము పిల్లలు, వారికి ప్రత్యేక అభినందనలు. ఈ ప్రేరణే ఈ పుస్తకము ఆవిర్భవించుటకు దారితీసినది.

పిల్లలయొక్క తల్లిదండ్రుల యొక్క చుఱుకైన సహవాసము లేకపోతే ఈ పుస్తకమే అర్థరహితమగును అటువంటి తల్లితండ్రులందరికి మా నిర్వ్యాజమైన కృతజ్ఞతలు.

మాకు సహాయ సహకారములందచేసిన ఎన్.ఐ.ఎమ్.ఎచ్ (NIMH) కార్యనిర్వాహక శాఖ వారికి మా అభినందనలు.

ఈ పుస్తక రూపకల్పన చేసిన చిత్రకారులకు, ముద్రించినవారికి కూడా మా అభినందనలు.

డా॥ అమర్‌జ్యోతి పర్శా

కె. వెంకట సుబ్బారెడ్డి

# ఈ పుస్తకము గురించి...

- ఈ పుస్తకము తల్లిదండ్రులకొరకు మరియు ఆధారికస్థాయి కార్యకర్తల కొరకు రూపకల్పన చేయబడినది.
- ఇందులో సరళమైన భాష వాడబడినది.
- ప్రతి సహజ, అసాధారణమైన స్థితులకు ఇచ్చిన ఉదాహరణలు స్పష్టమైనవి, స్వయం విశదీకరించబడినవి.
- ఇందలి పరిచయభాగము చలనము కలిగించు అవయవ సమస్యలు (మోటారు సమస్యలు) వాటి విభజన గురించి తెలుపును.
- కండర మృదుత్వం సాధించుటకు తేలికైన పద్ధతులు తెలుపబడినవి.
- చలనము కలిగించు అవయవ పెరుగుదలలోని దశలవారీగా దీనిలోని విషయములు ఏర్పాటు చేయబడినవి.
    - శిరస్సు స్వాధీనత
    - దొర్లుట
    - కూర్చొనుట
    - ప్రాకుట
    - మోకాలిపై కూర్చుండుట
    - నిలబడుట
    - నడచుట
- ప్రతీ శీర్షిక తిరిగి ఈ విధముగా విభజించ బడినది
    - సహజ స్థితులు – వర్ణన మరియు చిత్రవర్ణన
    - అసాధారణ స్థితులు – వర్ణన మరియు చిత్రవర్ణన



అసాధారణ స్థితులు ఈ క్రింది విధంగా విభజన చేయబడినవి.

1. బిగదీసుకుపోయినట్లుండు శిశువు : వర్ణన, చిత్రవర్ణన, సవరణ పద్ధతులు ఎదుటి పుటలో వరుస క్రమములో చిత్రవర్ణనతో తెలియచేయబడెను.
2. తూలునట్లు ఉండు శిశువు : వర్ణన, చిత్రవర్ణన, సవరణ పద్ధతులు ఎదుటిపుటలో వరుస క్రమములో చిత్రవర్ణనతో తెలియచేయబడెను.

- అసాధారణ స్థితుల గుర్తింపు, విభజన ఎక్కువ చేయుటకు వర్ణవిశదీకరణ చేయబడెను.
  - బిగదీసుకుపోయిన శిశువు స్థితులకు ఎరుపురంగు
  - తూలునట్లు ఉండు శిశువు చిత్రములకు నీలమురంగు
  - సవరణ పద్ధతుల చిత్రములకు వివిధ రంగులు
- అసాధారణతలను, సవరణలును కంటికి సులభముగా గోచరింపచేయుటకు అసాధారణ స్థితులను ✗ గుర్తుతోను, సవరణ చిత్రములను ✓ గుర్తుతోను గుర్తించబడెను.
- ప్రతి ఉపభాగము చివర ప్రేరేపణకు చేయవలసిన క్రియలు అనేపేరుతో ఆ స్థితికి సరియగు ఇంద్రియ బోధితమైన ప్రేరణ ఈ విధముగా ఇవ్వబడెను.
  - దృష్టి సంబంధితప్రేరణ
  - శ్రవణ సంబంధితప్రేరణ
  - స్పర్శ సంబంధితప్రేరణ

రచయితలు

# ఉపోద్ఘాతము

పిల్లలలో మెదడుకు గాయమువలన ఆలస్యముగా మరియు అసాధారణమైన పెరుగుదల సంభవించును. ఈ అసాధారణతలు ముఖ్యముగా చలనము కలిగించు అవయవమునందు కనబడి, తొందరగా గుర్తించవీలగును. ఇటువంటి పిల్లల సమస్యలు :

- శరీర భాగముల కదలికలో సమస్యలు
- గమనములో (ఒకచోటు నుండి ఇంకొక చోటికి పోవుటలో) సమస్యలు
- శరీర భంగిమను స్థిరముగా ఉంచుటలో సమస్యలు
- శరీరమును స్థిరముగా ఉంచుటలో సమస్యలు

కదలికావయవ సమస్యలుగల పిల్లలను రెండు ముఖ్య గ్రూపులుగా వర్గీకరించబడినది.

**1. బిగదీసుకుపోయినట్లుండు శిశువు**

ఈ పిల్లలు ఈ క్రిందివాటిలో ఏదైనా కలిగిఉందురు

- కండరములలో ఎక్కువ వత్తిడి.
- శరీరంలోని వివిధ భాగములు బిగదీసుకుపోయినట్లు ఉండుట
- పొట్ట బాణములా వంగి తల వెనుకకు వంగిపోయి ఉండును
- తుంట్లు, మోకాళ్ళు సాగి బిగదీసుకున్నట్లుండును
- చేతులు శరీరమునకు దగ్గరగా ఉంచును
- కదలిక మరియు స్థిరత్వము నిస్సారముగా ఉండును

కొంతమంది పిల్లలలో ఒక శరీర భాగము మాత్రమే బిగదీసుకుపోయినట్లు ఉండును

**ఉదాహరణకై :**

- నాల్గు అవయవములన్ని (కాళ్ళు మరియు చేతులు) మరియు శరీరము
- శరీరములోని ఒక సగభాగము
- పై అవయవము (చేతుల)లోనైనా, క్రింది అవయవములలో (కాళ్ళలో)నైనా

**2. అస్థిరత్వము (తూలునట్లు ఉండు) శిశువు**

ఇటువంటి పిల్లల లక్షణములు :

- కండరములలో తక్కువ వత్తిడి
- వదులైన కండరములు, కీళ్ళు
- ఎక్కువ పీఠాధారము
- నిస్సారముగా ఉండుట
- నిస్సారమైన కదలిక మరియు నిస్సారమైన స్థిరత్వము

ఈ మూల సమస్యలు కండరములలో అసాధారణమైన వత్తిడివలన కలుగును. దీనివలన అసాధారణమైన అంగవిన్యాసము (తీరు), కష్టమైన కదలిక సంభవించును. కండరముల వత్తిడిలో సహజత్వము కల్గించినచో, కదలిక మెరుగుపడి శిశువు పెరుగుదల సేర్వరితనము కలుగుటకు సహకరించును. ఇట్టి సహజస్థితికి తెచ్చుటకు వివిధ పద్ధతులుగలవు.

1. బిగదీసుకు పోయినట్లున్న కండరములకు సడలింపు కలుగజేయుట
2. శరీరమును సరియైన స్థితిలో ఉంచుట
3. తూలునట్లున్న కండరములకు ప్రేరణ కలుగజేయుట

**బిగదీసుకుపోయినట్లుండు శిశువులలో కండరముల బిగువును సడలించుటకు చర్యలు**

శరీర కండరములలో గట్టితనము పెంచుకున్న శిశువు చాలాకాలం తమ శరీరాన్ని బిగదీసుకొని ఉంచుదురు. వారిలో స్థిరత్వము కలిగించుటకు ముందుగా వారిలోని కఠినత్వం ఉపశమించు కార్యక్రమములు చేయవలెను.

- నెమ్మదిగా, క్రమపద్ధతిలో ఉయ్యాలలో ఊపుట
- నెమ్మదిగా, క్రమముగా సరళ సంగీతము/జోలపాట వినిపించుట
- సున్నితమైన స్పర్శ, సౌమ్యముగా సంబాళించుట
- ఊయల నెమ్మదిగా ఊపుట
- మెత్తటి గుడ్డ, సిల్కు వస్తువులతో శరీరముపై నెమ్మదిగా తట్టుట
- శిశువును తల్లితండ్రులు శరీరము దగ్గరగా హత్తుకొని జాగ్రత్తగా మరియు అనుకూలముగా పట్టుకొనవలెను/ఎత్తుకొనవలెను.
- నెమ్మదిగా, మెల్లగా లయబద్ధమైన ఉత్సాహ కార్యక్రమములు (శ్రవ్య, దృష్టి, స్పర్శ మరియు నడకసంబంధిత) చేయుట వలన శిశువులోని కఠినత్వం తగ్గును మరియు శిశువు వైద్యమునకు సుముఖత చూపును
- స్థిరత్వము తలిగించు కూర్చొను స్థితిని ఇతర కఠినత్వము ఉపశమించు క్రియతో కలిపిచేయుట
- నెమ్మది అయిన నిటారు భ్రమణము
- నీటిపరుపు, గింజల సంచీలతో ఆట

**స్థిరత్వములేని (తూలునట్లు ఉండు) శిశువులలో టోనువృద్ధిచేయు ప్రక్రియలు**

తక్కువ టోను కలిగిన పిల్లలలో భూగురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకముగా తమ శరీరమును నిల్పలేకపోయి వారి భంగిమలను స్థిరముగా ఉంచలేకపోవుట ఒక సమస్య.

పిల్లలలో టోను వృద్ధిచేయు కొన్ని ప్రక్రియలు

- వేగంగా, తీవ్రంగా ఊపుట
- వేగంగా, తీవ్రంగా తిప్పుట, ఊపుట
- వేగంగా ఉండు సంగీతం (శ్రావ్యమైనదానికంటే లయబద్ధంమైన సంగీతధ్వనులు)
- పిల్లవానితో పైకి క్రిందకు ఎత్తుతూ ఆడుట
- పిల్లవానిలో ప్రేరణకు సహాయపడు ప్రక్రియలు ఎక్కువ చేయుట
- ట్రాంపోలీన్‌పై గెంతుట
- గాలిలో ఎగురుతూ ఆడుట
- ఎగురుతూ ఆడుట
- బంతులు ప్రోగుచేయు క్రియలు
- బాగా మర్దన చేయుట

# శిరస్సు స్వాధీనత

## సహజమైన శిశువు యొక్క శిరస్సు స్వాధీనత

శిశువు సహజంగా శిరస్సుస్వాధీనత చేసుకొన్నచో

- తలను నిటారుగా నిలుపును
- తలను అటు ఇటు మరియు పైకి క్రిందికి త్రిప్పగలుగును
- తలను నిటారుగా నిలుపగల్గును.



అసహజమైన రీతిలో ఉన్నా లేదా తలను నిలుపుటలో ఆలస్యం జరిగినా నిపుణులను సంప్రదించండి.

# శిరస్సు స్వాధీనత


## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)



- శిశువు తల ప్రధానముగా ఒక ప్రక్కకు తిరిగి ఉండును.
- ముఖము తిరిగిన వైపుగల చేయి, కాలు తిన్నగా సరళరేఖలో ఉండును.
- ఎదుటివైపుగల చేయి పిడికిలి బిగించి యుండును, కాలు వంగి యుండును మరియు శరీరమును దగ్గరగా యుండును.
- శిశువు తలను నిటారుగా నిలుపుటకు, కష్టమగును.
- శిశువుకు తల త్రిప్పుటలో కష్టమగును.
- తల, భుజములు వెనుకకులాగి, వెనుక భాగము ధనురాకారముగా వంగును.

## సరిచేయుట

- సంరక్షకుడు తుంటిని, మోకాళ్ళను వంచి, వీపునకు ఆధారమిచ్చి కూర్చొనును.
- శిశువును సంరక్షకుని ఒడిలో కూర్చోపెట్టవలెను.
- శిశువు సంరక్షకునికి అభిముఖముగా ఉండును.
- శిశువు కాళ్ళు సంరక్షకుని ఛాతిపై నిటారుగా ఉంచవలెను.
- శిశువు వీపుకు సంరక్షకుని కాళ్ళు ఆధారముగా నుండును.
- శిశువును ఊయల లేక చిక్కపు ఊయల (దుప్పటిని రెండు స్తంభములకుగాని మంచపు కర్రలకుగాని కట్టగా ఏర్పడిన ఊయల) లో పరుండపెట్టవలెను.
- శిశువు ఆ ఊయలలో నిద్రపోవును లేక ఆడుకొనును.
- శిశువు తల ఎత్తుగా ముందుకు వంచి ఉంచవలెను.
- శిశువు తల వెనుకకు వంగిపోకుండా ఉండగలదు.
- వెనుకభాగం ముందుకు వంగి ధనురాకారముగా వెనకకు వంగకుండుటకు తోడ్పడును.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

శిశువును ఇలాఉన్నప్పుడు ఎత్తుకొనకూడదు

- శిశువు తల వెనుకకుపడి, దేహం ధనురాకారముగా వెనుకకు వంగి ఉన్నప్పుడు.
- తుంటి, మోకాళ్ళు సాగి ఉన్నప్పుడు.



## సరిచేయుట

శిశువును ఎత్తుకొను విధానము

- శిశువు ముఖము ముందుకు వుంచి, ఛాతికి సంరక్షకుని చేయి ఆధారమగునట్లు ఉంచవలెను.
- శిశువువీపు నిటారుగా ఉంచి సంరక్షకుని ఛాతి ఆధారముగా ఉండవలెను.
- శిశువు తుంటి, మోకాళ్ళు వంచి, తొడలు అడుగు భాగమున సంరక్షకుని చేయి ఆధారముగా పట్టుకొనవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

# శిరస్సు స్వాధీనత


## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు పడుకొన్నపుడు వీపుభాగము ధనురాకారముగా వంగి, చేతులు చాచి ఉండును.
- శిశువు ప్రక్కకు తిరుగుట కష్టముగా ఉండును.



## సరిచేయుట


- సంరక్షకుడు కాళ్ళు చాచుకొని కూర్చొనవలెను.
- శిశువుని సంరక్షకుడు తనకు అభిముఖముగా తన కాళ్ళపై పరుండపెట్టవలెను.
- శిశువు తలకు సంరక్షకుని పాదములు ఆధారముగా నుండవలెను.
- శిశువు కాళ్ళు మోకాలు వద్ద వంగి ఉండవలెను.
- శిశువు తలకు దిండు ఆధారముగా పెట్టి పరుండపెట్టవలెను.
- శిశువు తుంట్లు, మోకాళ్ళ క్రింద దిండును (లేక మడచిన దుప్పటి) ఆధారముగా ఉంచవలెను.
- గాలికొట్టిన రబ్బరు తిత్తిపై పరుండపెట్టవలెను. శిశువు తల, మెడ వంగి ఉండును.
- కాళ్ళు, తుంట్లు, మోకాళ్ళవద్ద వంగి ఉండవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు తన పొట్టపై పడుకొనును. తన తల, భుజములను భూమికి హత్తుకొనును.
- చేతులు తన శరీరమునకు అడుగున ఉంచును. తల, వీపు, భుజములు పైకి లేపలేరు.
- చేతులపై బరువు మోపుటకై ముందుకు చాచలేరు.



## సరిచేయుట

- సంరక్షకుడు వెల్లకిలా పడుకోవలెను.
- తలకు తలగడ ఆధారముగా ఉంచుకొనవలెను.
- శిశువును ఛాతిమీద సంరక్షకుని అభిముఖముగా పడుకో పెట్టుకొనవలెను.
- శశువును ఛాతిక్రింది చేతులు పెట్టి పట్టుకొనవలెను.
- శిశువును సంరక్షకుని ముఖము చూచునట్లు ప్రోత్సహించవలెను.
- శిశువు తలను ఎత్తిపెట్టుటకు ప్రోత్సహించవలెను.




టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

# శిరస్సు స్వాధీనత

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- తల, దేహము స్వాధీనములో లేని శిశువు (తూలునట్లుండు శిశువు)ను ఎత్తుకొనకూడని విధానము.
- తల ఛాతిపై పడిపోవునట్లు.
- తన వెనకకు వాలునట్లు.
- పొట్ట ముందుకు వంగునట్లు.
- వీపు చుట్టుకొని పోవునట్లు.
- కాళ్ళు వ్రేళాడుతూ లేదా ఎడంగా ఉండునట్లు.



## సరిచేయుట

- తూలునట్లు ఉండు శిశువును ఎత్తుకొను సరైన విధానము. అతని కాళ్ళు వంచి దగ్గరగా పట్టుకొనుట.
- తుంట్ల వద్ద గట్టి ఆధారము కల్పించుట.
- దీనివలన శిశువు తన తల, వీపులను, చాచును.




టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను


# శిరస్సు స్వాధీనత

## ప్రేరేపణకొరకు చేయవలసిన ప్రక్రియలు :

**దృష్టి సంబంధమైనవి :** శిశువు తలపైకి ఎత్తి తల్లి ముఖాన్నిగాని కాంతివంతమైన రంగుల బొమ్మలనుగాని చూసేందుకు ప్రేరేపించండి. శిశువు తలను పైకి ఎత్తి పైన ఉంచిన అద్దములో తనను చూచుకొనునట్లు ప్రేరేపించుట. ఈ విధముగా శిశువు తన ముందుగల వ్యక్తులనుగాని, ముఖములనుగాని చూడగలుగును, వస్తువులుగాని బొమ్మలుగాని, ఒకవైపునుండి, రెండవవైపు మార్పిడిని గమనించును. తన ప్రతిబింబమును అద్దములో చూచుకొనును.



**శ్రవణ సంబంధమైనవి :** వినుటను ప్రేరేపించుటకు వీలైనంత సమయము శిశువుతో మాట్లాడుట లేక పాటలను వినుపించుటచేయవలెను. దీనికొరకు సంగీతము వినుపించు లేదా శబ్దముచేయు బొమ్మలు, అలారం గడియారములు వాడవచ్చును. వీటివలన శిశువు ధ్వనివైపు తిరుగుట, ధ్వనుల ఉనికిని గుర్తించుట, పిలిచినపుడు గుర్తించుట, తలను కదుపుటకు సహకరించును.




**స్పర్శసంబంధమైనవి :** శిశువును తల్లి ముఖమును ముట్టుకొనుటకు. మెడపై చక్కిలిగింతపెట్టి ప్రేరేపించవలెను. మెడవెనుక రుద్దుటవలన శిశువు తన తల ఎత్తుటకు సహాయపడును.

# దొర్లుట

**సహజమైన శిశువు దొర్లుట**


- సహజమైన శిశువు వెనుక నుండి ముందుకు పొట్టపైకి దొర్లును.
- తుంట్లు, భుజముల మధ్య మెలి తిప్పుతూ దొర్లును.
- ముందు తల త్రిప్పుతూ, తరువాత భుజములు, పొట్ట, తుంట్లు మరియు కాళ్ళు కదల్చుట జరుగును.



ఈ విషయంలో ఆలస్యం జరిగినా లేదా ఏదైనా అసహజముగా అనిపించినా నిపుణులను సంప్రదించవలెను.

## అసాధారణ స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)


- శిశువు కాళ్ళు చాచి ఉండును.
- మోకాళ్ళు తగులుతుండును.
- తుంట్లు కొంచెము వంగి ఉండును.
- శిశువు దొర్లినపుడు భుజములు, దేహము దొర్లదు.
- బిగదీసుకున్నట్లు దొర్లును.



## సరిచేయుట

శిశువును ఎడమవైపు దొర్లించుట


- సంరక్షకుడు శిశువు కుడికాలును వంచి, ఎడమకాలిని చాచి పెట్టి రెండు కాళ్ళను పట్టుకొనవలెను.
- రెండు కాళ్ళు పట్టుకొని శిశువునకు ఎడమవైపు సగం త్రిప్పవలెను. శిశువు ఒక ప్రక్కగా పడుకొని ఉండును.
- ఒక ప్రక్కగా పడుకున్న స్థితి నుంచి పొట్టపై పడుకొనునట్లు త్రిప్పవలెను.
- పైన చెప్పిన విధముగానే వ్యతిరేకదిశలో కుడివైపుకు దొర్లుటకు ప్రయత్నం చేయవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను


## అసాధారణ స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు కాళ్ళు చాచి ఉండును.
- మోకాళ్ళు తగులు తుండును.
- తుంట్లు కొంచెము వంగి ఉండును.
- శిశువు దొర్లినపుడు భుజములు, దేహము దొర్లదు.
- బిగదీసుకున్నట్లు దొర్లును.



## సరిచేయుట


- శిశువును వీపుకు ఆధారము కల్పించి ఒక ప్రక్కకు తిప్పి పడుకోబెట్టవలెను.
- కాళ్ళను విడిగా ఉంచి వాటిమధ్య గుండ్రని దిండు ఉంచవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను


## అసాధారణమైన (తూలునట్లుండు శిశువు)

- శిశువు దొర్లినపుడు తల, భుజములు వెనుకకు విరుచును.
- దొర్లుట తుంట్లు మరియు కాళ్ళ వద్ద ఆరంభమగును.



## సరిచేయుట

- శిశువును వీపుపై పరుండపెట్టి కాళ్ళను తిన్నగా తుంటివరకు ఎత్తి సంరక్షకుడు ఆధారము కల్పించవలెను.
- శిశువును తుంటి, మోకాలును వంచి ఆధారమిచ్చి ప్రక్కకు తిప్పవలెను.
- శిశువును ప్రక్కనుండి పొట్టమీదకు దొర్లించవలెను.
- తలెత్తి మోచేతులపై భారము మోయునట్లు చేయవలెను.




టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను


## దొర్లుట

### ప్రేరణకు చేయవలసిన ప్రక్రియలు


**దృష్టి సంబంధమైనవి :** కాంతివంతమైన రంగులుగల లేక నలుపు మరియు తెలుపు పూసల దండను శిశువు పడుకొన్న లేక తిరుగువైపుగల మణికట్టుకు కట్టి రెండవ చేతితో పూసలను అందుకొనునట్లు ప్రోత్సాహించి దొర్లుటకు సహకరించవలెను.



**శ్రవణ సంబంధమైనవి :** శిశువు ప్రక్కగా ఒక పళ్ళెము ఉంచుము. శిశువు ఒక ప్రక్కగా పడుకొని ఉండగా ఖాళీగా ఉన్న చేతికి స్పూను ఇచ్చి ఆ స్పూనుతో పళ్ళెమును కొట్టునట్లు చేయవలెను. ఈ విధముగా చేయుటవలన శిశువు దొర్లుటకు సహకరించవచ్చును.



**స్పర్శ సంబంధమైనవి :** ఒక టెడ్డీబేరును గాని, మెత్తని బొమ్మనుగాని నేలపై ఉంచి శిశువును దానిని ఖాళీచేతితో పట్టుకొనునట్లు ప్రోత్సహించవలెను. అటులనే ఒక బంతిని వివిధ మార్గములలో ఉంచి శిశువును దానిని అందుకొనునట్లు ప్రయత్నించవలెను. ఇట్లు చేయుటవలన శిశువు దొర్లుటకు సహాయమగును.



# కూర్చొనుట


## సహజమైన శిశువు కూర్చొనుట

కుర్చీపై కూర్చొనుట

- వీపు, తల నిటారుగా (లంబముగా) ఉండును.
- తుంట్లు మోకాళ్ళు వంగి ఉండును (పటంలో చూపిన విధముగా)
- పాదములు బల్ల పరపుగా భూమిపై ఉండును.

నేలపై కూర్చొనుట

- వీపు, తల నిటారుగా ఉండును.
- తుంట్లు మోకాళ్ళు వంగి ఉండును (పటంలో చూపిన విధంగా)
- తొడ వెలుపలి భాగం నేలను ఆనును.




అసహజమైన రీతిలో ఉన్నా లేదా కూర్చొనుటలో ఆలస్యం జరిగినా నిపుణులను సంప్రదించండి.

# కూర్చొనుట

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువుతల, భుజములు వెనుకకు విసరినట్లుండును.
- వెనుక భాగము ధనురాకారముగా వంగి ఉండును.
- పిఱుదుల క్రిందకు నొక్కును.
- తుంటి, మోకాళ్ళు, మడమ తిన్నగా ఉండును.
- కాలివ్రేళ్ళు క్రిందకు వంగినట్లుండును.



## సరిచేయుట

- శిశువును కుర్చీలో కూర్చోపెట్టుము (పటములో చూపిన విధముగా) కుర్చీకి ముందుభాగము ఎత్తుగా ఉండవలెను.
- తల, మెండెము నిటారుగా ఉండునట్లు ఆధారము కల్పించవలెను. అవసరమైతే ఛాతివద్ద ఒక పట్టీ కట్టవలెను.
- తుంట్లు, మోకాళ్ళు వంగి ఉండునట్లు పటంలో చూపిన విధవంగా ఆధారం కల్పించవలెను.
- పాదములు బల్లపరపుగా ఆనించి ఉండవలెను.
- అవసరమైతే పట్టీతో ఆధారము కల్పించవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

# కూర్చొనుట

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- క్రిందిభాగము అవయవములలో ఎక్కువ బిఱుసుగా ఉండుట.
- శిశువు తొడల క్రింద కాళ్ళను మడిచి మడమలు పిఱ్ఱలను తాకుతూ కూర్చొనును.



## సరిచేయుట

- శిశువును సంరక్షకుని కాళ్ళమధ్య కూర్చోపెట్టవలెను.
- శిశువు తల, వీపు నిటారుగా సంరక్షకుని ఆధారంగా ఉంచవలెను.
- శిశువు చేతులు స్వేచ్ఛగా ఆడుటకు, త్రిప్పుటకు వీలు కల్పించవలెను.
- సంరక్షకుడి కాళ్ళు చాచి శిశువు తొడలు దగ్గరగా ఉంచవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

# కూర్చొనుట


## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శరీరంలో సగభాగం బిగదీసుకుపోయినట్లు ఉండుట.
- శిశువు సహజంగా ఉండు శరీరంలోని సగభాగంను మాత్రమే ఉపయోగించును.
- మిగిలిన సగభాగం బిగదీసుకుపోయినట్లు ఉండును.
- శిశువు బిగదీసుకుపోయిన భాగమువైపు కాలు వంచి, అవతలివైపు సహజముగా ఉంచి కూర్చొనును.
- బిగదీసుకుపోయిన చేయి ఛాతికి దగ్గరగా వుంచును.



## సరిచేయుట

- శిశువును బిగదీసుకుపోయిన చేయి అరచేయి ఆధారముతో నేలకు నొక్కి పెట్టి ఉంచవలెను.
- శిశువు బిగదీసుకుపోయిన భాగమువైపు కూర్చొను స్థితిలో మోకాళ్ళను వంచవలెను.




విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

# కూర్చొనుట

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు తల, భుజము వెనుకకు వంగి ఉండును.
- వెనుక భాగము ధనురాకారముగా వంగి ఉండును.
- పిఱుదులు క్రిందకు నొక్కి వుంచును.
- తుంటి, మోకాలు, మడమ నిటారుగా ఉండును.
- కాలివ్రేళ్ళు వంచినట్లుండును.



## సరిచేయుట

- శిశువు తల ముందుకు చూస్తూ, ఛాతికి కాళ్ళు మరియు చేతులను దూరంగా, సంరక్షకుని చేతుల ఆధారంతో ఉంచవలెను. (పటం-1)
- శిశువు కాళ్ళు విడిగా ఉంచి, దేహం తల్లి చేతుల ఆధారము కల్పించి తల్లి నడుముకు ఆన్చి ఎత్తుకొనవలెను (పటం-2)
- సంరక్షకుడు బిగుసుకుపోయిన భాగము ఎడమవైపున ఉంటే తన ఎడమవైపు అటే కుడివైపయిన కుడివైపు శిశువును ఎత్తుకొనవలెను (పటం-2)



(పటము-1) (పటము-2)

విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారనమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు కాళ్ళు వంచి చేతులు మడచి కూర్చొనును.
- తల వెనుకకు వంచి శరీరము ముందుకు వంచును.
- మెడను చాచి, వీపు భాగమును వంచును.



## సరిచేయుట

- శిశువును (పటములో చూపిన విధముగా) కుర్చీలో కూర్చోపెట్టవలెను. కుర్చీ ముందుకన్న వెనుక ఎత్తుగా ఉండవలెను.
- శిశువు తలను కాయమును నిటారుగా ఆధారంతో ఉంచవలెను. అవసరమైతే ఛాతి వద్ద పట్టీతో కట్టవలెను.
- పటంలో చూపినట్లు తుంట్లు మోకాళ్ళు ఆధారంతో స్థిరంగా ఉంచవలెను.
- పాదములు బల్లపరపుగా ఉపరితలమును ఆని ఉండవలెను.
- అవసరమైతే పట్టీతో ఆధారము కల్పించవలెను.



టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

# కూర్చొనుట

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు వదలైన కండరములతో తూలు శరీరము కలిగి ఉండును.
- శిశువు రెండు కాళ్ళు దూరంగా ఉంచి నేలమీద కూర్చొనును.
- చేతులు నేలపై ఆన్చి ఆధారముచేసికొనును.
- వీపు భాగము గుండ్రముగా వంగి ఉండును.



## సరిచేయుట

- శిశువును తల్లికాలుపై కూర్చుండపెట్టవలెను.
- వీపు భాగము సరళరేఖలో ఆధారము కల్పించి ఉంచవలెను.
- తుంట్ల వద్ద ఆధారము కల్పించుము.
- అతను కదలికకు వీలగునట్లు తక్కువ ఆధారము పీఠమునకు కల్పించుము.




టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

# కూర్చొనుట


## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు విడిగా చాచిన కాళ్ళు, వంగి విడిగా ఉంచిన చేతులతో కూర్చొనును.
- శిశువుకు పైనున్న అవయవములు వెనుకకు వంగి, చేతులు ముందుకు ఆడుకోవడానికి తీసుకురాడు.
- శిశువు ఈ స్థితి నుండి కదలి ఆడలేడు.
- శిశువు పడిపోతానని భయపడతాడు.



## సరిచేయుట

- శిశువును మోకాళ్ళు వంచి దగ్గర చేసి తొట్టెలో కూర్చోపెట్టవలెను.
- వీపుభాగము తొట్టె గోడల భాగమును ఆధారము చేసి నిటారుగా ఉంచవలెను.



టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

# కూర్చొనుట

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- తల, శరీరము స్వాధీనములో లేని శిశువును ఎత్తుకొనుటకు తప్పు విధానము
- ఈ స్థితిలో శిశువు తన చుట్టు ప్రక్కలను చూడలేదు.
- శిశువును వంగిన ప్రదేశముపై ఆన్చి ఎత్తుకొనుటవలన బాహ్యావాతావరణమును గమనించ సాధ్యము కాదు.
- శిశువు కాళ్ళు వెడల్పుచేసి ఉంచును.
- తల వెనుకకుగాని ప్రక్కలకుగాని పడినట్లుండును.
- చేతులు ఎడముగా ఉంచడమో లేదా ప్రక్కకువాలినట్లుండును.



## సరిచేయుట

తూలునట్లుండు శిశువును ఎత్తుకొను సరియైన విధానము


- అతని కాళ్ళు దగ్గరగా వంచి ఎత్తుకొనవలెను.
- తుంట్లవద్ద గట్టి ఆధారము కల్పించవలెను.
- దీనివలన శిశువు తల, వెనుక భాగము చూచుటకు వీలు కలుగును.
- తల్లి శరీరమునకు వీపు ఆధారముగా నుంచవలెను.



టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

# కూర్చొనుట

## ప్రేరేపణకు చేయవలసిన ప్రక్రియలు



**దృష్టి సంబంధమైనవి :**

- శిశువుముందు ఒక కాంతి వంతమైన రంగుబొమ్మను వ్రేలాడతీయుము. ఇది శిశువు ఆ బొమ్మపై దృష్టినిలుపుటకు దోహదపడును. ఆ బొమ్మను ఇటు అటు కదిపినచో శిశువు దాని కదలికను చూచుటకు దోహదమగును.
- శిశువుముందు బల్లపై ఆకర్షణీయమైన బొమ్మలను ఉంచి వాటిని శిశువు అందుకొనుటకు, పట్టుకొని ఆడుకొనుటకు సహకరించవలెను.
- శిశువును తల్లి ఎత్తుకొని వేర్వేరు వస్తువులను, పటములను, బొమ్మలను చూపవచ్చును.



**శ్రవణ సంబంధమైనవి :**

- శిశువుముందు ధ్వనిచేయు బొమ్మలను దారముతో కట్టుము. శిశువు వాటిని పట్టుకొని, లాగి, కొట్టి శబ్దం కలిగించుటను ప్రోత్సహించుము.
- శిశువు ముందు ధ్వనిచేయు గిలకలనుగాని, సంగీతము, ధ్వని నిచ్చు పరికరములుంచి వాటిని అందుకొని, కొట్టునపుడు వచ్చు ధ్వనిని విని ఆనందించునట్లు చేయుము.
- శిశువుముందు ఒక పళ్ళెము స్పూను ఉంచుము. శిశువు పళ్ళెమును స్పూనుతో కొట్టుతూ ఆడుకొనునపుడు వచ్చిన శబ్దము అతనికి ప్రేరణ కల్పించును.



**స్పర్శ సంబంధమైనవి :**

- శిశువుముందు గుడ్డ పీచులతో చేసిన వేరువేరు బొమ్మలను వ్రేలాడదీయుము. శిశువు వాటిని తాకినపుడు అతనికి క్రొత్త అనుభవము కలిగించును.
- శిశువుముందు మెత్తని బొమ్మలను ఉంచుము. శిశువు వాటిని తాకినపుటు అతనికి వాటి స్పర్శవల్ల క్రొత్తక్రొత్త అనుభవములు కలుగును. మెత్తని పెద్ద బొమ్మలు శిశువు స్పర్శ ప్రేరణ కల్పించుటకు దోహదము చేయును.

# ప్రాకుట

## సహజమైన శిశువు ప్రాకుట


- ఒకదాని తరువాత ఇంకొక అవయవముల కదలిక.
- శరీరమును సరియగునంతగా కుచించుట, సాగతీయుట.
- తల, శరీరముతో ఒకే వరుసలో ఉంచుట.



అసహజమైన రీతిలో ఉన్నా లేదా ప్రాకుటలో ఆలస్యం జరిగినా నిపుణులను సంప్రదించండి.

## అసాధారణమైన (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు, మోచేతులు, మోకాళ్ళపై ప్రాకును.
- అచాతుర్యమైన (వికారమైన) చేతులు, కాళ్ళు శరీరమునకు దగ్గరగా ఉంచి ప్రాకుట.
- సామర్థ్యములేని శరీర భాగములు ఒకదాని తరువాత ఇంకొకటి కదల్చుట.
- శిశువు తల క్రిందకు వంచుట.
- బరువు మార్పిడి లేకపోవుట.



## సరిచేయుట


- శిశువును ప్రాకు స్థితిలో ఉంచుట (రెండు చేతులు, రెండు కాళ్ళపైన)
- శిశువు శరీరమును సంరక్షకుని తొడపై ఆధారము కల్పించుట.
- శిశువును తన బరువును చేతులపై, మోకాళ్ళపై తీసుకొనునట్లు చేయుట.
- తుంట్లవద్ద ఆధారము కల్పించుట.
- శరీర బరువును ముందు, వెనుకలకు ప్రక్కలకు మార్పిడి చేయుట.
- శిశువుకు బరువును మార్చుచూ ముందుకు ప్రాకుటకు ప్రోత్సహించుట.
- తరువాత, శిశువు ఒకటి తర్వాత ఒకటికి బరువును మార్చుచూ ముందుకు కదలగలుగవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు తన రెండు కాళ్ళను జతచేసి ఒకేసారి కదల్చుచూ ప్రాకును. (కుందేలు గెంతినట్లు)
- ఈ విధమైన కదలిక క్రింది అవయవములు బిఱుసుగా ఉండు (మృదుత్వములేని) శిశువులలో ఎక్కువగా కన్పించును.



## సరిచేయుట


- శిశువును ప్రాకు స్థితిలో ఉంచుము
- కాళ్ళను మోకాళ్ళకు కొంచెము క్రిందుగా పట్టుకొనుము.
- శిశువు ముందుకు కదలునపుడు ఒక కాలు తరువాత ఒకటి కదలునట్లు ప్రోత్సహించుము.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు కూర్చుని ముందుకు జరుగును, శరీరం క్రింది భాగముపై బరువును మోపును.
- మోకాళ్ళు వంచి, చేతులపై భారమునుంచి (క్రిందిభాగము నిటునటు కదల్చుచూ) కదలును.



## సరిచేయుట


- శిశువును ప్రాకుస్థితిలో ఉంచుము.
- పటములో చూపినట్లు తుండును శిశువు నడుముచుట్టు చుట్టి పట్టుకొనుము.
- శిశువు బరువును, ముందువెనుకలకు, ప్రక్కలకు మార్చును.
- బరువును ఒకప్రక్క తర్వాత వేరొక ప్రక్కకు మార్చుచూ శిశువు ముందుకు పోవుటకు ప్రోత్సహించుము.




టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

## ప్రేరేపణకు చేయవలసిన ప్రక్రియలు


**దృష్టి సంబంధమైనవి :** శిశువునకు కొంచెము దూరములో ఒక కాంతివంతమైన రంగు బొమ్మను ఉంచుము. శిశువును ఆ బొమ్మను ప్రాకి అందుకొనుటకు ప్రోత్సహించుము.



**శ్రవణ సంబంధమైనవి :** శిశువునకు సుమారు ఒక అడుగు దూరములో ఒక గంటను కట్టి, గంటను కొట్టుచూ శిశువును ప్రాకుతూ ఆ గంటను చేరుటకు ప్రోత్సహించుము.



**స్పర్శ సంబంధమైనవి :** వేర్వేరు అల్లికలు కల్గిన నార, పట్టు, నేత పట్టీలతో ఒక ప్రక్కను ఏర్పాటు చేయుము. శిశువును ఆ ప్రక్కపై ప్రాకునట్లు చేయుము. ఆ విధముగా ప్రాకునపుడు శిశువు ఆ ప్రక్కపై గల వేర్వేరు పదార్థముల యొక్క స్పర్శ సంబంధిత ప్రేరణ కల్గును. మెత్తని, సున్నితమైన పదార్థములు, ఉద్రేకులైన శిశువులకు మరియు బిఱుసు పదార్థములు, తూలునట్లు ఉండే స్వభావముగల శిశువులకు ఉపయోగించవలెను.



# మోకాళ్ళపై కూర్చుండుట

### సహజమైన శిశువు మోకాళ్ళపై కూర్చుండుట

- తల, దేహములు, ఒకే సరళరేఖలో ఉండును (నిటారుగా)
- వీపు వంగకుండా తుంటి తిన్నముగా నుండును.
- బరువు రెండు మోకాళ్ళపై ఉండును.
- రెండు చేతులతో ఆడును.




ఈ విషయంలో ఆలస్యం జరిగినా లేదా మోకాళ్ళపై నిల్చుటలో అసహజముగా అనిపించినా నిపుణులను సంప్రదించవలెను.

# మోకాళ్ళపై కూర్చుండుట

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు శరీరము, తల ముందుకు వంచి మోకాలిపై నిలబడును.
- చేతులు ఆధారముగా చేసికొనును.
- చేతులు ముడిచి శరీరమునకు దగ్గరగా ఉంచును.



## సరిచేయుట

- సంరక్షకుని కాళ్ళమధ్య పొట్టకు ఆధారమిచ్చి మోకాళ్ళపై శిశువను నిలపెట్టవలెను.
- శిశువు తన బరువును మార్పిడిచేయునట్లు అతనితో ఆటలు ఆడవలెను.
- తగులుతున్న మోకాళ్ళు అయినచో మోకాళ్ళ మధ్య దిండు ఉంచుము.
- శిశువును తల్లికాలు ఆధారముతో మోకాళ్ళపై నిలుచునట్లు చేయుము.
- వంచిన మోకాళ్ళపై బరువు పడునట్లు ప్రోత్సహించుము.
- బొమ్మలను ఇరువైపుల ఒకవైపు తర్వాత ఇంకొకవైపు ఇచ్చుచు బరువు మార్పిడికి తోడ్పడుము.




విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

# మోకాళ్ళపై కూర్చుండుట

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు చేతులు వెనకకు వుంచి మోకాళ్ళపై నిలబడును.
- ఛాతి ముందుకు వత్తబడి ఉండును.
- శరీరము బిగదీసుకుపోయినట్లు కనిపించును.
- శిశువు తుంటిని తిన్నగా ఉంచుటకు బదులు తన శరీరము ధనురాకారములో వుంచును.



## సరిచేయుట


- ముందు వైపు (పీట లేక బల్ల) ఆధారము చేసి శిశువును మోకాళ్ళపై నిల్చొను స్థితిలో ఉంచుము.
- సంరక్షకుని చేతులు శిశువు తుంట్లకు ఇరువైపున వుంచి ఆధారము కలుగచేయుము.
- అతని చేతులను ముందుకు చాచి అతను ఆడుకొనుటకు ప్రోత్సహించుము.




విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

# మోకాళ్ళపై కూర్చుండుట


## ప్రేరేపణకు చేయవలసిన ప్రక్రియలు



**దృష్టి సంబంధమైనవి :** శిశువు పడిపోకుండా మోకాళ్ళపై నిల్చుటకు అతని ముందు ఒక ఎత్తు తక్కువగాఉన్న బల్లను ఉంచి దానిపై కాంతివంతమైన రంగుల బొమ్మలను (ఘనాకారముగలవి) ఉంచుము.



**శ్రవణ సంబంధమైనవి :** ధ్వనితో ప్రేరేపణ చేయుటకు శిశువు దగ్గర ధ్వని చేయు బొమ్మలను ఉంచుము. వీటిని కిటికీ ఉచలకుగాని ఎత్తైన బల్ల యొక్క కాళ్ళమధ్యకాని తాడుతో వ్రేలాడదీయుము. శిశువు ప్రాకు స్థితిలో ఉన్నపుడు ఈ బొమ్మలను కదిపి ధ్వని కలుగచేసి అతడు వాటిని కొంత ఎత్తులో మోకాళ్ళపై నిలబడి పట్టుకొనునట్లు ప్రోత్సహించుము.




**స్పర్శ సంబంధమైనవి :** శిశువును మోకాళ్ళపై నిలిపి అతనిని మీ మోకాళ్ళ మధ్య ఆధారము కల్పించి ఆ స్థితిలో ఉండునట్లు చేయుము. అతనిని కొంచెంసేపు అలా ఉండుటకు మెత్తని బొమ్మలతో ధ్వనిచేసి అతని దృష్టిని మరల్చి ఆ స్థితిలో ఉండునట్లు దోహదం చేయుము.

**సూచన :** పైన చెప్పిన పద్ధతులన్నీ శిశువును మోకాళ్ళపై నిల్చుని ఉండి తన బరువును వంగిన మోకాళ్ళపై మోయునట్లు తోడ్పడవలెను.

# నిలబడుట

**సహజమైన శిశువు నిలబడుట**

- తల దేహములు ఒకే సరళరేఖలో ఉండును. (నిటారుగా)
- తుంట్లు, మోకాళ్ళు తిన్నగా సరళరేఖలో ఉండి పాదములు సరిఅయిన బరువును తీసుకొనును.



ఈ విషయంలో ఆలస్యం జరిగినా లేదా ఏదైనా అసహజముగా అనిపించినా నిపుణులను సంప్రదించవలెను.


## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు తల ముందుకు వంచి నిలబడును.
- శిశువుకు చేతులు, దేహ వెనుక భాగము బిఱుసుగా (మృదుత్వము లేక) ఉండును.
- శిశువు తన తుంట్లను నిటారుగా ఉంచలేడు.



## సరిచేయుటు

- శిశువు వీపును గోడకు ఆధారము చేసి నిటారుగా నిలబెట్టవలెను.
- పీటకాని బల్లకాని అతని ముందుంచుము.
- చేతులను ఖాళీగా ఉంచుము.
- శిశువును ఆడుకోనివ్వాలి (బొమ్మలతో)



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను


## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)



- శిశువు తల ముందుకు వంచి నిలబడును.
- శిశువుకు చేతులు, దేహ వెనుక భాగము బిఱుసుగా (మృదుత్వము లేక) ఉండును.
- బరువు మోయుట సమానముగా (సరిగా) జరుగదు.
- శిశువు తన రెండు చేతులతో ఆడుకోలేదు.

## సరిచేయుట


- శిశువును సంరక్షకుని ఆధారముతో నిలబెట్టుము.
- సంరక్షకుని కాళ్ళు శిశువు తుంట్లు, వెనుక భాగముకు ఆధారము కల్పించవలెను.
- శిశువు తన ముందు ఎత్తుగా కట్టిన బొమ్మలను చూచునట్లు చేయుము.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు చేతులు బిఱుసుగా ఒకదానిపై ఒకటి పెట్టి, మెడలో బిఱుసుదనముతో నిలుచును.
- శిశువు మోకాళ్ళు వంగి ఉండును.
- చేతులు పిడికిలి బిగించి ఉండును.



## సరిచేయుట


- శిశువును సంరక్షకుని కాళ్ళమధ్య శిశువు తుంట్లను తన మోకాళ్ళతో పట్టి ఉండునట్లు నిలబెట్టుము.
- చేతులు విప్పుటకు, వేళ్ళను తిన్నగా నిటారుగా ఉంచుటకు దోహదము చేయుము.
- శిశువు చేతులు విప్పి వస్తువులను పట్టుకొనునట్లు చేయుము.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు బిఱుసు అయిన (మృదుత్వములేని) కాళ్ళతో, చేతులతో నిలుచుని ఉండును.
- శరీరము ముందుకు వంగి ఉండును.



## సరిచేయుట


- శిశువును నిటారుగా నిల్చునట్లు చేయవలెను.
- సంరక్షకుని చేతులతో శిశువు తుంట్లకు ఆధారము కల్పించవలెను.
- సంరక్షకుని తొడల మధ్యన మోకాళ్ళు సమముగా ఉంచవలెను.
- శిశువును మోచేతి ఎత్తులో ఉన్న బొమ్మలతో ఆడునట్లు చేయవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

**అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)**

- శిశువు వీపు, చేతులు, మెడ వెనుకకు విరిచినట్లు నిలుచును.
- శిశువు పిడికిలి బిగించి ఉండును.



## సరిచేయుట


- శిశువు యొక్క మోకాళ్ళు, పొట్ట సంరక్షకుని చేతుల ఆధారము కల్పించి అతనిని నిలుపవలెను.
- శిశువు వీపు, తలకు ఆధారము కల్పించుట వలన తలవెనుకకు వంగకుండా వెనుక భాగము ధనురాకారము వంగకుండా నిరోధించవచ్చును.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు రెండుకాళ్ళు ఒకదానిపై ఒకటి ఉంచి ఆధారముతో నిలుచును.
- చేతులు మోచేతివద్ద, మణికట్టువద్ద వంగును.
- అరచేయి పిడికిలి బిగించిన స్థితిలో ఉండును.
- చేతులు శరీరమునకు దగ్గరగా ఉంచును.



### సరిచేయుట

- శిశువును కాళ్ళు దూరముగా ఉంచినిలబడునట్లు చేయవలెను. దీనికి సంరక్షకుని తొడను ఉపయోగించవలెను.
- శిశువు భుజములు శరీరము నుండి దూరముగా వుంచవలెను. మోచేతులు, మణికట్టు నిటారుగా ఉంచవలెను.
- శిశువు పిడికిలి తెఱచి వస్తువులు పట్టుకొనునట్లు చేయవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను


## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు ఆధారముతో నిలుచును.
- కాళ్ళు దూరముగా ఉండి స్థిరత్వము కోల్పోయి ఉండును.
- చేతులు వదులుగా ప్రక్కలకు వ్రేళాడును.
- శిశువు తల ముందుకుగాని వెనుకకుగాని వాలును.



## సరిచేయుట

- శిశువును సంరక్షకుడు గోడ ఆధారముతో నిలబెట్టవలెను.
- భుజములకు ఆధారము కల్పించి తలను తిన్నగా (నిటారుగా) ఉంచవలెను.
- చేతులు శరీరమునకు దగ్గరగా ఉంచవలెను.
- కాళ్ళు తిన్నగా (నిటారుగా) ఉంచవలెను.
- పాదములు గట్టిగా నేలమీద ఉంచవలెను.



టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు తూలు (వదులు) తున్న కండరములతోను, వంగిన కాళ్ళతోను, వ్రేలాడుతున్న చేతులతోను నిలుచును.
- తల ముందుకు వంగి ఉండును.



## సరిచేయుట


- శిశువు మోకాళ్ళు, శరీరముకు ఆధారమిచ్చి సంరక్షకుని కాళ్ళ మధ్య నిలుపవలెను.
- నిటారుగా ఉంచి ముందుకు చూచునట్లు చేయవలెను.



టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను


## అసాధారణమైన స్థితి (తూలుట్లుండు శిశువు)

- శిశువు తూలుతున్న (వదులు) కండరములతో, ధనురాకారములో వంగిన మోకాళ్ళతో నిలుచును.
- శిశువు ముందు వంగి వుండును.



## సరిచేయుట


- శిశువు మోకాళ్ళను గట్టి ఆధారముతో నిలబెట్టి, తల, శరీరము తిన్నగా (నిటారుగా) ఉండునట్లు చూడవలెను.




టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

## ప్రేరేపణకు చేయవలసిన ప్రక్రియలు

**దృష్టి సంబంధమైనవి :** శిశువును ఎత్తు తక్కువగాఉన్న బల్ల లేక కుర్చీముందు నిలబెట్టుము. వాటిపై కాంతివంతమైన రంగు బొమ్మలు (ఘనాలు, ప్లాస్టిక్ పెట్టెలు) ఉంచుము. శిశువును వాటిని వరుసగా ఒకటిపై ఒకటి ఉంచుట, పడగొట్టుట క్రియలను చేయుటకు సహాయము చేయుము.



**శ్రవణ సంబంధమైనవి :** శిశువును బల్లపై ఉంచిన స్పూనుతో ఆడుకొనునట్లు చేసి ఆ ఆటను చూచి ఆనందించునట్లు చేయుము.




**స్పర్శ సంబంధమైనవి :** ఒక పెద్ద ఖాళీ అట్టపెట్టెను (అట్టపెట్టె ప్రక్కలు వివిధ పదార్థములతో చేసి ఉండవలెను) తీసుకొని దానిలో శిశువును ఉంచి వానితో మాట్లాడుము. దీనివలన మనమాటలు విని శిశువు పెట్టె ప్రక్కలు పట్టుకుని లేచుటకు ప్రయత్నము చేయును.

# నడచుట

## సహజమైన శిశువు నడచుట


- తల దేహములు ఒకే సరళరేఖలో (నిటారుగా ఉండును).
- సరిఅయిన బరువును తీసుకొని కాళ్ళు ఒకటి తరువాత ఒకటి కదుపును.
- శరీరం తిప్పుతూ ఒకచేతి తరువాత వేరొకచేయి ఊపును.



ఈ విషయంలో ఆలస్యం జరిగినా లేదా ఏదైనా అసహజముగా అనిపించినా నిపుణులను సంప్రదించవలెను.


## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు వంగిన మోకాళ్ళతో, శరీరమును ముందుకు వంచి నడచును.
- శిశువు చేతులు ఆధారముకొరకు వెదకుచూ నడచును.



## సరిచేయుట

- శిశువు తన తల, శరీరము తిన్నగా ఉంచి మూడుచక్రాల బండితో నడిపించవలెను.
- శిశువును కోడిగ్రుడ్డు ఆకారముగల తొట్టె ఆధారముతో, తల్లి అతని నడుము పట్టుకొని నడిపించవలెను.
- శిశువుకు అదనముగా మోకాళ్ళవద్ద ఆధారము కావలసినచో నిపుణుల సలహాతీసుకొనుము.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు తుంట్లు, మోకాళ్ళు వంచి నిలుచును.
- అస్థిరత్వముతో నడచును.
- శిశువు అడుగులు చాలా దగ్గరగా వేయును.



## సరిచేయుట


- సంరక్షకుడు కర్రను అడ్డముగా పట్టుకొని దాని ఆధారముతో శిశువును నడిపించవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను


## అసాధారణమైన స్థితి (బిగదీసుకుపోయినట్లుండు శిశువు)

- శిశువు మోకాళ్ళు వంచి పొట్ట ముందుకుచేసి నడచును.
- ఆధారముకొరకు చేతులు చాపుచూ నడచును.



## సరిచేయుట


- శిశువుకు ఒక చేతితో సహాయము అందిస్తూ ర్యాంప్ (వాలుబల్ల)పై నడిపించవలెను.
- శిశువును చేతిలో కర్ర సహాయముతో నడిపించవలెను.



విశ్రాంతి కొరకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)

- శిశువు దూరముగా చాచిన కాళ్ళతో నడచును.
- చేతులను ప్రక్కకుచాచును.
- అస్థిరముగా నడచును.



### సరిచేయుట


- శిశువును చేతిలో బొమ్మలు పట్టుకొని ఇరుకైన దారిలో నడిపించవలెను.
- సంరక్షకుకు శిశువు భుజములపై చేతులు ఉంచి శిశువు ముందుకు వంగిపోకుండా సహాయము చేయవలెను.



టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

## అసాధారణమైన స్థితి (తూలునట్లుండు శిశువు)


- శిశువు దూరముగా చాచిన కాళ్ళతో నడచును.
- చేతులను ప్రక్కకుచాచును.
- అస్థిరముగా నడచును.



## సరిచేయుట

- శిశువు చేతిని సంరక్షకుడు పట్టుకొని మెట్లను ఎక్కించవలెను.
- శిశువును ఎత్తుపల్లములుగల ఉపరిభాగముపై (ఇసుకనేలపై) ఆధారమిచ్చి నడుపించవలెను.






టోన్ వృద్ధిపరుచుటకు ప్రక్రియలు చేయవలెను

# నడచుట


## ప్రేరేపణకు చేయవలసిన ప్రక్రియలు

**దృష్టి సంబంధమైనవి :** శిశువును గదిలో ఒకమూలన నిలబెట్టి సంరక్షకుడు ఎదుటి మూలలో కాంతివంతమైన వస్తువుగాని, కొవ్వొత్తిగాని, టార్చ్‌లైటుగాని పట్టుకొని నిలబడి శిశువును నడచి తనవద్దకు వచ్చునట్లు ప్రోత్సహించవలెను.



**శ్రవణ సంబంధమైనవి :** శిశువును తోపుడు బండి సహాయముతో నడిపించవలెను. ఆ బండికి ఒకగంటకట్టినచో నడచునపుడు ఆ గంట శబ్దము శిశువుకు ఆనందము కలుగచేయవచ్చును.

స్పర్శ సంబంధమైనవి : చతురస్రాకారముగాని, త్రిభుజాకారముగాని అయిన కొబ్బరిపీచు, లేక ఇసుకనింపిన లేక ఊకతోచేసిన ఆకారములతో ఒక బల్లమాదిరిగా తయారు చేయుము దానిపై శిశువును నడిపించుము. అవసరమైతే ఆధారమిచ్చి నడిపించుము.



**సూచన :** పైన వాడినపదార్థములు మృదుత్వముగల శిశువునకు మెత్తగాను, మృదువుగాని, కదులుతున్న అవయవములుగల శిశువుకు కరకుగాను, ముతగగాను ఉండవలెను.